

జన కేతనం
▶ ఐటీ...నో ప్రయారిటీ...!!
▶ ఓటు వేయండిలా... -7లో
▶ ఏయూకు రాజకీయ చెద!



ఓటర్లకు ఎర

జోరందుకున్న డబ్బు, మద్యం పంపిణీ

- ఓటుకు రూ.1,000 నుంచి రూ.2,000 వరకు పంచుతున్న వైసీపీ అభ్యర్థులు
- ఇతర పార్టీల అభ్యర్థులు కూడా..
- ఎవరికి ఓటు వేయాలో స్పష్టమైన నిర్ణయానికి వచ్చిన ఓటరు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. ఇక పోలింగ్ సమరమే మిగిలి ఉంది. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నోటుతో ఓటు కొనేందుకు సిద్ధమ య్యారు. పోలింగ్‌కు ఒక్క రోజు మాత్రమే సమయం ఉండడంతో ఓటర్లకు డబ్బు పంపిణీని వేగవంతం చేశారు. మందుబాబులకు మద్యం పంపిణీ కూడా చేస్తున్నారు.

ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కేందుకు వైసీపీ నాయకులు గ్రామాల్లో ఓటుకు రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.2 వేలు వరకు పంచుతున్నారు. ఎలమంచిలి, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక నేత ఏకంగా గ్రామాలను యూనిట్‌గా తీసుకొని గంపగుత్తగా ఓట్లు కొనుగోలుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. అనకాపల్లి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఇరు పార్టీల నేతలు ఇప్పటికే ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ పూర్తి చేశారు. గ్రామాలకు మద్యం భారీగా నిల్వ చేసి యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నారు. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో నోట్లు, మద్యం పంపిణీ ఇప్పటికే సగం పూర్తి చేసినట్టు సమాచారం. రాత్రి వేళ గ్రామాల్లో నాయకులు పర్యటించి డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారు.

ఓ నిర్ణయానికి వచ్చిన ఓటరు

ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేయాలి?, ఎవరిని గెలిపించాలనే విషయంలో ఓటరు స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసినా తన నిర్ణయంలో మార్పు రానంతంగా స్పష్టతకు వచ్చాడని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇంతకాలం గుంభనంగా, నిశ్శబ్దంగా ఉన్న ఓటరు ఇప్పుడు తమకు అన్నివిధాలా మేలు జరుగుతుందని భావించే అభ్యర్థికి ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారు.



అచ్యుతాపురంలో పంపిణీ చేస్తున్న గోవా మద్యం

యథేచ్ఛగా గోవా మద్యం పంపిణీ

అచ్యుతాపురం: మండలంలో శనివారం రాత్రి నుంచి మద్యం, నగదు పంపిణీ ప్రారంభమైంది. ఇక్కడ కూటమి, వైసీపీల మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఓటర్లకు ఎవరు ఎంత ఇస్తారో చూద్దామని ఇరు పార్టీలు ఎదురుచూశాయి. అయితే అధికార పార్టీ నాయకులు శనివారం నుంచి ఓటుకు రూ.1500ల నగదు, ఒక క్వార్టర్ మద్యం బాటిల్ ఇస్తున్నట్టు తెలిసింది. కూటమి అభ్యర్థులు కూడా అదే విధంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. కాగా మద్యం చాలా నాసిరకం పంపిణీ చేస్తున్నారని మందుబాబులు చెబుతున్నారు. ప్లాస్టిక్ మద్యం బాటిల్‌పై గోవాలో తయారైనట్టు లేబుల్ ఉంది. ఎమ్మార్పీ కేవలం పాతిక రూపాయలు ఉంది. శనివారం సాయంత్రం నుంచి ప్రభుత్వ మద్యం షాపులు మూసేశారు. దీంతో రాత్రి నుంచి గ్రామాల్లో రాజకీయ ... మిగతా 8వ పేజీలో



ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న వైసీపీ కార్యకర్త అరెస్టు

- రూ.50 వేలు నగదు, 19 పేర్లు కలిగిన జాబితా స్వాధీనం

కొత్తూరు, మే 11: ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బులు పంచుతున్న వైసీపీ కార్యకర్తను ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆర్.ఎస్.ఆర్.గణపతిరావు పట్టుకొని అనకాపల్లి రూరల్ పోలీసులకు అప్పగించారని ఎస్‌ఐ తేజేశ్వరరావు శనివారం తెలిపారు. వెంకుపాలెం గ్రామానికి చెందిన కశింకోట రమేశ్ ఓటర్లకు నగదు పంచుతుండగా వారు పట్టుకున్నారని చెప్పారు. అతని వద్ద ఉన్న రూ.50 వేలు నగదు, 19 పేర్లు కలిగిన జాబితా పేపరును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మూగబోయిన మైకులు

ముగిసిన ఎన్నికల ప్రచారం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో శనివారం ఐదు గంటల తరువాత మైకులు మూగబోయాయి. ఈ నెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వచ్చింది. ఇది ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం నిలిచిపోయింది. అభ్యర్థులు ప్రచారంతో పాటు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రసారాలు నిలిపి వేశాయి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారాలపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. కాగా శనివారం అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి.



ప్రచారం ముగియడంతో విశాఖలో మైకులను తొలగిస్తున్న దృశ్యం

మందు చూపు!

మందుబాబుల ముందు జాగ్రత్త

- ఉదయం నుంచే మద్యం దుకాణాల వద్ద బారులుతీరిన వైనం
- రెండు రోజుల పాటు దుకాణాలకు సెలవు కావడంతో రద్దీ
- ఎండను సైతం లెక్క చేయకుండా పడిగాపులు



రావికమతంలో మద్యం దుకాణాల వద్ద బారులు తీరిన మందుబాబులు

చోడవరం, మే 11:

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనుండడంతో శనివారం ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. మందుబాబులు ముందు జాగ్రత్తగా ఆదివారం, సోమవారం నాటి కోసం మద్యం సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో గ్రామాల్లో పార్టీల నాయకులు కూడా తమ అనుచరులకు డబ్బులు ఇచ్చి మరీ వారికి అవసరమైన మద్యం తెప్పించేందుకు ప్రయత్నించడంతో దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. పరిమితంగానే దుకాణాల వద్ద మద్యం అమ్ముతుండడంతో దుకాణాల వద్ద పడిగాపులు కాసి మరీ మందుబాబులు మద్యం కొనుగోలు చేయడం కనిపించింది.

రావికమతంలో..

రావికమతం: మండలంలోని మద్యం దుకాణాల వద్ద శనివారం ఉదయం 8 గంటల నుంచే మందుబాబులు బారులుతీరారు. రావికమతంలో రెండు దుకాణాలు, తట్టబంద ... మిగతా 8వ పేజీలో

మద్యం షాపులు మూసివేత



అనకాపల్లిలో శనివారం సాయంత్రం మద్యం షాపునకు సీల్ వేసిన ఎక్సైజ్ అధికారులు

అనకాపల్లి టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూతపడ్డాయి. జిల్లాలోని 151 మద్యం షాపులు, పది బార్లను ఎన్నికల కారణంగా ముందస్తుగా అధికారులు మూసివేయించి సీల్ వేశారు. ఎన్నికల సందర్భంగా మద్యం తాగి ఎవరూ గొడవలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు అన్ని దుకాణాలను మూసివేయించి సీల్ వేశారు. మద్యం దుకాణాలు, బార్‌లు తిరిగి మంగళవారం తెరుచుకోనున్నాయి.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, పక్కన ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,529 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 12,89,371 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారిలో 6,27,321 పురుషులు, 6,62,022 మంది మహిళా ఓటర్లు, 28 మంది ఇతర ఓటర్లు ఉన్నారని చెప్పారు.

340 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

1,529 పోలింగ్ కేంద్రాల్లో 340 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ చేస్తున్నట్టు తెలిపారు. పీవోలు 1,759 మంది ఏపీవోలు 1,743 మంది, 7,036 సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు. 3,666 బ్యాలెట్ యూనిట్లు, 3,666 కమిషనింగ్ యూనిట్లు, 3,968 వీవీ ప్యాట్లు, 25 బృందాలు సిద్ధం చేశామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల బందోబస్తులో భాగంగా కేంద్ర బలగాలు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. రౌడీషీటర్లు, ఎన్నికల్లో గతంలో ఇబ్బందులు కలిగించిన వారిని గుర్తించి అవసరం మేరకు తగిన చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో రానున్న 48 గంటల పాటు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని తెలిపారు. చెక్‌పోస్టులను మరింత పటిష్ఠంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

» కూటమి శ్రేణులకు బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు(అనకాపల్లి), మే 11: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే విధంగా కూటమి నాయకులు, కార్యకర్తలు చూడాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత 40 రోజులుగా కూటమి నాయకులు, కార్యకర్తలు తమకు ఎంతో సహకరించి పనిచేశారన్నారు. వారే అభ్యర్థుల మాదిరిగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. గత ఎన్నికల్లో 81 శాతం ఓటింగ్ నమోదు అయ్యిందని, ఈ ఎన్నికల్లో మరింత ఓటింగ్ శాతం పెరిగే విధంగా చూడాలని కోరారు. ఏడు అసెంబ్లీ అభ్యర్థులకు ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. ధర్మందే విజయం.. పొత్తుదే గెలుపు.. కూటమిదే పీఠం శ్లోకంతో ముందుకు వెళుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ఫాం-17సి తీసుకునేంత వరకు ఏజెంట్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. మాడుగుల, చోడవరం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. గెలిచిన తరువాత చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానన్నారు. కౌంటింగ్ జరిగే 20 రోజుల్లో ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందిస్తానని చెప్పారు. కాగా సాక్షి పేపర్‌కు ఒక బ్రదర్, సిస్టర్ ఉన్నారని ఆరోపించారు. మీడియాను ఫోర్త్ పిల్లర్‌గా వాడాలే గాని సాక్షి బ్రదర్ అండ్ సిస్టర్స్‌ను ఇష్టమొచ్చినట్టు వాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, నాయకులు కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమికి 148 అసెంబ్లీ సీట్లు ఖాయం

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు (అనకాపల్లి), మే 11: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ధీమా వ్యక్తంచేశారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం 120, జనసేన 21, బీజేపీ 7...మొత్తం 148 నియోజకవర్గాల్లో గెలవబోతున్నట్టు జోస్యం చెప్పారు. తనకు రెండు లక్షల మెజారిటీ వస్తుందని, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని చెప్పారు. వైసీపీని బంగాళాఖాతంలో తోసేయడం ఖాయమన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి లండన్ వెళతారని అంటున్నారని పేర్కొన్నారు.

ఫ్యాన్‌కు ఎదురుగాలి



విశాఖ వాసుల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి

'వైసీపీ పాలనలో ధరలు ఆకాశాన్ని అంటాయి. సాధారణ, మధ్య తరగతి ప్రజలు బతకడమే కష్టంగా మారింది. కరెంట్, బస్ చార్జీలు, నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో మాపై నెలకు రూ.6 వేలకుపైగా అదనపు భారం పడింది.'

- ఆర్.శ్యామల, గృహిణి, పిఠాపురం కాలనీ

"నిరుద్యోగులకు జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. నాకు తెలిసి ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకుండా ఐదేళ్లు పూర్తిచేసిన ఘనత వైసీపీ సర్కారుకే దక్కుతుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగుల ఉసురు జగన్‌కు తగలకపోదు. నిరుద్యోగులు దెబ్బ ఎలా ఉంటుందో జగన్ ఈ ఎన్నికల్లో చూస్తారు."

- టి.సూర్యచంద్ర, నిరుద్యోగి, మద్దిలపాలెం

"జగన్‌కు ఉన్న అనుభవ రాహిత్యం ఐదేళ్లలో స్పష్టంగా కనిపించింది. ముందు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో లోపాలుంటే వాటిని సరిచేసి పాలన సాగించాలి. అంతేకానీ, ఆ నిర్ణయాలను ఐదేళ్లపాటు తప్పుబడుతూ ముందుకువెళ్లడం వల్ల ఫలితం ఉండదు. జగన్ విషయంలో ఇదే జరిగింది. చంద్రబాబు నిర్ణయాలను ఇప్పటికీ తప్పుబట్టడం వల్ల ఫలితం ఉండదు. జగన్ చేసిన కొన్ని పనులు బాగానే ఉన్నప్పటికీ... ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా చేశారు. బటన్ నొక్కుడు పథకాలతో ఎమ్మెల్యేలు, ఎంపీలను డమ్మీ చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు లాంటి అనుభవం ఉన్న నాయకుడు కావాలి. కేంద్రంలో మరోమారు నరేంద్రమోదీ రావాలి"

- ఎం.సూర్యనారాయణస్వామి, సీనియర్ సిటిజన్, ఎంవీపీ కాలనీ

- ఐదేళ్లుగా పనులు లేక అల్లాడిపోయామని భవన నిర్మాణ కార్మికుల ఆవేదన
- జగన్ కనీససాయం చేయలేదంటూ ఆగ్రహం
- నగరాన్ని ఐదేళ్ల నుంచి పట్టించుకోకుండా చివరిలో హడావిడిగా బస్టాపులు నిర్మించారన్న ఒక రిటైర్డు సివిల్ ఇంజనీర్
- వాటిల్లోనూ నాణ్యత లేదని పెదవివిరుపు
- ప్రభుత్వ భవనాలు తాకట్టు పెట్టడమేమిటని ప్రశ్నించిన కాంట్రాక్టర్
- పాలనా రాజధాని చేస్తానన్న జగన్...నగరానికి తెచ్చిన ఒక్క ప్రాజెక్టు పేరు చెప్పాలన్న ఐటీ ఉద్యోగి
- తమకు ఇచ్చిన దానికంటే తీసుకున్నదే ఎక్కువన్న ఆటో డ్రైవర్
- నిత్యావసర ధరల పెరుగుదలపై మహిళల ఆందోళన
- వేతనంలో పది శాతం బస్ చార్జీలకే పోతోందని మరో యువతి ఆవేదన
- జగన్ సర్కారు చేసినంత అన్యాయంగతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్న ఓ నిరుద్యోగి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోలింగ్‌కు మరికొద్ది గంటలు సమయం మాత్రమే ఉంది. ఈ తరుణంలో నగర ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నాన్ని 'ఆంధ్రజ్యోతి' చేసింది. నగరంలో అనేక ప్రాంతాలను సందర్శించింది. అయితే అధికార పార్టీపై అనేక వర్గాల్లో తీవ్రమైన వ్యతిరేకత సుస్పష్టంగా కనిపించింది. అధికార పార్టీపై ప్రజల్లో ఈ స్థాయి వ్యతిరేకతను చూడడం ఇదే తొలిసారి అని ఏయూలో పనిచేసిన ఓ రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ పేర్కొనడం గమనార్హం.

అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకత

గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచిన వారిలో భవన నిర్మాణ కార్మికులు ముందున్నారు. అటువంటివారు ఇప్పుడు పూర్తి వ్యతిరేకంగా మారిపోయారు. గడిచిన ఐదేళ్లలో తమకు రూపాయి సాయం చేయలేదని, పై పెచ్చు తమకు చెందిన వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించాడంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్న రామకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. ఇసుక కొరతతో పనులు దొరకని పరిస్థితిలో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారిందని రోజువారీ కూలీగా వెళుతున్న లక్ష్మి వాపోయింది. జగన్ మరోసారి అధికారంలోకి వస్తే తమకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయన్న భావనను వెంకోజీపాలెంలో ఉంటున్న రాడ్ బెండర్ శివయ్య వ్యక్తం చేశాడు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో విశాఖ నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మరికొందరు ఆరోపించారు. ఐదేళ్లలో విశాఖను పట్టించుకోకుండా... ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న సమయంలో సిటీలో హడావిడిగా పనులు చేశారని, వీటిలో నాణ్యత లోపించిందని ఒక రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ పేర్కొన్నారు. నగర పరిధిలో ఏర్పాటు చేసిన అనేక బస్టాపుల్లో ఈ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విశాఖలోని ప్రభుత్వ ఆస్తులను జగన్ ప్రభుత్వం తనఖా పెట్టిందని, ఇది అత్యంత దారుణమని రాజేశ్వరరావు అనే కాంట్రాక్టర్ వాపోయారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కాపలాదారుగా ఉండాలని, అటువంటిది వారే ఆస్తులను తనఖా పెట్టడమేమిటని విమర్శించారు. విశాఖను పాలనా రాజధానిగా చేస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి...గడిచిన ఐదేళ్లలో నగరానికి తెచ్చిన కీలక ప్రాజెక్టులు గురించి చెప్పాలని ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్న జశ్వంత్ డిమాండ్ చేశారు. ఐటీ పరిశ్రమ విశాఖలో పూర్తిగా డీలా పడిందని, దీనివల్ల ఉద్యోగాలకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గడిచిన ఐదేళ్లలో రోడ్లను కనీసం పట్టించుకోలేదని, దీనివల్ల వాహనాలు పూర్తిగా పాడయ్యాయని ఆటో డ్రైవర్ రాజు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.పది వేలు ఇస్తున్నానని చెప్పుకుంటున్నారని...ఫైన్లు, ఇతరత్రా రూపేణా అంతకు నాలుగింతలు తమ నుంచి వసూలు చేసుకున్నారని ఆరోపించాడు.

గడిచిన ఐదేళ్లలో నిరుద్యోగులకు అవకాశాలు పూర్తిగా అడుగంటిపోయాయని, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కూడా దొరకడం లేదని కార్తీక్ అనే యువకుడు పేర్కొన్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్లలో నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయాయని, చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకురావడం ఇబ్బందిగా మారిందని హెచ్‌బీ కాలనీకి చెందిన రాజేశ్వరి అనే గృహిణి పేర్కొన్నారు. బస్ చార్జీలు భారం ఐదేళ్లలో రెట్టింపు అయిందని, వేతనంలో పది శాతం చార్జీలకే సరిపోతోందని ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న రుక్మిణి అనే యువతి పేర్కొంది. కూటమి ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం తమకు ఎంతో మేలు చేస్తుందని ఆమె తెలిపింది. నిరుద్యోగులకు జగన్ సర్కారు చేసినంత మోసం, అన్యాయం ఇప్పటివరకూ ఏ ప్రభుత్వమూ చేయలేదని నాగరాజు అనే నిరుద్యోగి పేర్కొన్నాడు. గడిచిన ఏడేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నానని, ఒక్కసారి కూడా నోటిఫికేషన్ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం ద్రోహం చేసిందని ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు.

మద్యంతో ఆరోగ్యాన్ని పూర్తిగా గుల్ల చేశాడని, గతంలో ఎప్పుడూ చూడని, వినని మద్యాన్ని అమ్ముతూ ప్రజలను దోచుకుంటున్నాడని లారీడ్రైవర్‌గా చేసే గొల్లబాబు పేర్కొన్నారు. నిరుద్యోగులకు కూటమి అందిస్తానన్న నిరుద్యోగ భృతి అద్భుతంగా ఉందని, అందుకే కూటమికి ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్టు మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన సురేష్ అనే యువకుడు పేర్కొన్నాడు. ఉచిత బస్సు పథకం, గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నెలకు రూ.1500 స్కీమ్‌తో మహిళలకు చంద్రబాబు ఆర్థిక భరోసా ఇస్తున్నారని, ఈసారి కూటమికి ఓటేస్తే మేలు జరుగుతుందని ఆరిలోవ ప్రాంతానికి చెందిన శ్రీలక్ష్మి అనే మహిళ పేర్కొన్నారు. చంద్రబాబుకు అధికారాన్ని అందిస్తే నిరుద్యోగులకు మేలు కలుగుతుందని, ఐటీ రంగానికి బూమ్ వస్తుందని ప్రముఖ ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధి విషయంలో చంద్రబాబుకు విజన్ ఉందని, ఐటీ, ఆర్థిక రాజధానిగా విశాఖ వెలుగొందాలంటూ కూటమికి అవకాశం కల్పించాలని ప్రముఖ ఐటీ సంస్థలో హెడ్‌గా పనిచేస్తున్న ఒకాయన పేర్కొన్నారు.

కూటమికే బీసీ సామాజికవర్గం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

అనకాపల్లి టౌన్, మే 11: ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తమ సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర అన్నారు. స్థానిక విశాఖ ఫైనాన్స్ హాల్‌లో శనివారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం పట్టణ శాఖ సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో ఈ ఐదేళ్లల్లో బీసీలు వెన్నుముక అని చెబుతూ వారిని అన్నివిధాలా మోసం చేశారన్నారు. కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు, విధులు లేకుండా కేవలం జీతాలకే పరిమితం చేశారని వారు ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి రాజకీయంగా ఎదగకుండా చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా, భావితరాలకు ఉద్యోగావకాశాలు రావాలన్నా.. 13న జరిగే ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థితో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు బుద్ద భూలోకనాయుడు, కొణతాల చంద్రరావు, బొడ్డేడ అప్పారావు, గుడాల సత్యనారాయణ, పిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు అనకాపల్లి డిపో నుంచి 70 బస్సులు

అనకాపల్లి టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అనకాపల్లి పీటీడీ డిపో నుంచి 70 బస్సులను కేటాయించారు. ఈ బస్సుల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలింగ్ సామగ్రిని తరలించనున్నారు. అనకాపల్లి డిపో నుంచి ఎలమంచిలి నియోజకవర్గానికి 15, చోడవరానికి రెండు, మాడుగులకు రెండు, పాడేరుకు 20, పాయకరావుపేటకు 27, నర్సీపట్నానికి నాలుగు బస్సులు కేటాయించినట్టు పీటీడీ అధికారులు తెలిపారు. డిపోలోని వంద బస్సుల్లో 70 బస్సులు పోలింగ్‌కు ఆదివారం ఉదయానికే ఆయా నియోజకవర్గ ప్రధాన కేంద్రాలకు వెళ్లనున్నాయి. అయితే ఈ కారణంగా సామాన్య ప్రయాణికులకు ప్రయాణ ఇబ్బందులు తప్పవు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

» జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్ , మే 11: జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన వివిధ రాజకీయపార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న 72 గంటల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం నిషేధమన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురికి మించకుండా ఇంటింటా ప్రచారం చేసుకోవచ్చునన్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి తెరపడిందన్నారు. ఓటర్లపై ఎలాంటి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ 48 గంటల ముందు సైలెన్స్ పిరిడ్‌ను అమలు చేస్తుందన్నారు. సైలెన్స్ పిరిడ్ 11వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమై మే 14న ముగుస్తుందన్నారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అర్హులైన ఓటర్లందరికీ పోలింగ్ స్టేషన్ వద్ద సురక్షితంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించడం జరిగిందన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రశాంతత పోలింగ్ నిర్వహణకు జిల్లా అంతటా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్, పోలీస్ పరిశీలకులు రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే మాదిగలకు న్యాయం

» ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కోస్తా జిల్లాల ఇన్‌చార్జ్ చిన్నసుబ్బారావు మాదిగ



కృష్ణాదేవిపేటలో మాట్లాడుతున్న చిన్నసుబ్బారావు మాదిగ

కృష్ణాదేవిపేట, మే 11: రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు న్యాయం జరగాలంటే కూటమి అభ్యర్థులకు అంతా ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కోస్తా జిల్లాల ఇన్‌చార్జి డాక్టర్ ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో స్థానిక ఎమ్మార్పీఎస్, మాదిగల సంఘం నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఐదువేల మందితో చర్చించి కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం ఇచ్చే అవకాశం ఉంటుందని మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు నడమర్తి చినబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగల మానోభావాలను గుర్తించకపోవడంతో కూటమికి మద్దతు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేమగిరి అర్జున్, నాయకులు చిట్టిబాబు, పల్లపాటి నాగేశ్వరరావు, అనిల్, స్థానిక నాయకులు గజ్జలపు అప్పారావు, కుందూరు అనంద్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పుతో మార్పు రావాలి

» కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

» లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



రైతులతో మాట్లాడుతున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

కొత్తూరు, మే 11: రాష్ట్ర రాజకీయాల్లో ప్రజలిచ్చిన తీర్పుతో గొప్ప మార్పు రావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం అనకాపల్లి మండలం సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో ఆయన పర్యటించి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాజకీయాల్లో నిజాయితీపరుల సంఖ్య తగ్గి, వ్యాపారుల సంఖ్య పెరిగిందన్నారు. కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందితే ఉత్తరాంధ్రలోని సాగు, తాగునీరు ప్రాజెక్టు కోసం పోరాటం చేస్తారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాయకరావుపేట, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలకు మూతవేసి రైతులను, కార్మికులను, ఉద్యోగులను దెబ్బతీశారన్నారు. దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలున్న అనకాపల్లి బెల్లం మార్కెట్ దివాళా తీసిందన్నారు. చంద్రబాబునాయుడు, నరేంద్రమోదీ, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కనుబుడ్డి నరసింగరావు, కొలసాని రమణ, జనసేన నాయకుడు గంగుపాం మహేష్, బొబ్బిలి రమణ, టీడీపీ నాయకులు టి. ప్రసాదరావు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మందు కోసం పాట్లు



అనకాపల్లిలో ఒక మద్యం దుకాణం వద్ద బారులుతీరిన మందుబాబులు

అనకాపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం అమ్మకాలకు కళ్లెం పడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు మూత పడ్డాయి. జిల్లాలో 24 మండలాల్లో 150 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రతి రోజు ఆయా దుకాణాల ద్వారా రూ.2.3 కోట్లు వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. రానున్న 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూత పడనున్నాయి. దీంతో మందుబాబులు శనివారం దుకాణాల వద్ద బారులు తీరారు. మద్యం కొనుగోలుకు మందుబాబులు పోటీ పడ్డారు. ఎండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్నం 2 గంటల వరకు దుకాణాలు కిక్కిరిసిపోయాయి. సాయంత్రం దుకాణాలు మూసేస్తారని ముందుగానే గుర్తించిన రాజకీయ పార్టీల నాయకులు తమ అనుచరులతో కొన్ని మద్యం దుకాణాలతో పనిచేస్తున్న సిబ్బందితో మద్యం కొనుగోలు చేయించి తరలించారు. మద్యం దుకాణాలు ఈనెల 13 పోలింగ్ తరువాత సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత తెరవనున్నారు.

క్రైం... crime news

ఎస్‌ఎల్‌ఎన్ నగర్‌లోని ఇంట్లో చోరీ

అనకాపల్లి టౌన్, మే 11 : స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని ఎల్ఐసీ ఉద్యోగి గ్రంధి శశికాంత్‌గుప్తా ఇంట్లో గురువారం అర్ధరాత్రి జరిగిన చోరీపై శుక్రవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ మహ్మద్‌అలీ తెలిపారు. ఎస్‌ఎల్‌ఎన్ నగర్‌లో నివాసముంటున్న ఎల్ఐసీ ఉద్యోగి గ్రంధి శశికాంత్‌గుప్తా గురువారం రాత్రి భోజనం చేసి భార్యాభర్తలు బెడ్‌రూమ్‌లో నిద్రపోయారన్నారు. గుర్తు తెలియని ఆగంతకులు బెడ్‌రూమ్‌కు ఆనుకుని ఉన్న మరో గది కిటికీ గ్రిల్స్ తప్పించి లోపలకు ప్రవేశించి బీరువాలోని రెండు తులాల బంగారం వస్తువులు, పూజ గదిలోని 50 తులాల విలువైన వెండి వస్తువులను అపహరించుకుపోయారన్నారు. క్లూస్ బృందం తనిఖీలు నిర్వహించిందన్నారు. గ్రంధి శశికాంత్‌గుప్తా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

107 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 11: మండలంలో వేర్వేరు చోట్ల 107 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. లంకెలపాలెం గ్రామానికి చెందిన మునగపాక అశోక్‌కుమార్ స్థానిక మద్యం దుకాణం నుంచి శనివారం 18 క్వార్టర్ మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. అలాగే పెదముషిడివాడకి చెందిన పి.నాగవెంకట సూరిఅప్పారావు వద్ద 45 క్వార్టర్ మద్యం సీసాలను పట్టుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన పి. జగదీష్ వద్ద 44 క్వార్టర్ మద్యం సీసాలను పట్టుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. వారి వద్ద గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మే 11: మండలంలోని నర్సింగబిల్లిలో ఒక ఇంటి వద్ద 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.రమేష్‌బాబు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇళ్లపు ఈశ్వరరావు ఇంటి వద్ద మద్యం అమ్మకాలు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ఈశ్వరరావును అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోలుగుంట ఉపాధ్యాయిని నాగజ్యోతికి అవార్డు

హైదరాబాద్‌కు చెందిన సంస్థ దార్ల బుక్ ఆఫ్ రికార్డుతో సత్కారం



సాధించిన పతకాలతో నాగజ్యోతి

రోలుగుంట, మే 11 : మండల కేంద్రం రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని నాగజ్యోతి, ఆమె కుమార్తెకు హైదరాబాద్‌కు చెందిన సంస్థ దార్ల బుక్ ఆఫ్ రికార్డును అందజేసింది. ఉపాధ్యాయిని నాగజ్యోతి, ఈమె కుమార్తె సాహితిలు వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో మాతృదినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. నాగజ్యోతి పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని అనేక పతకాలు సాధించారు. అలాగే ఈమె కుమార్తె సాహితి కూడా క్రీడలతో పాటు స్విమ్మింగ్‌లో ప్రపంచ రికార్డులు సాధించి ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. వీరి సాధిస్తున్న ప్రతిభను గుర్తించి దార్ల బుక్ ఆఫ్ రికార్డును ఇద్దరికీ అందజేశారు. ఈ సందర్భంగా వీరిని ఎంఈవో జాన్‌ప్రసాద్, హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554


స్టార్టప్ విలేజ్

ప్రముఖ కంపెనీలన్నీ పరార్

చెప్పిందేదీ చేయలేదు... అదే జగన్ మార్క్!



- కోర్టు ఆదేశించినా రాయితీలు ఇవ్వని వైసీపీ సర్కార్

ఐటీ నో ప్రయారిటీ...!


మిలీనియం టవర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాసులే కనిపిస్తారు. హైదరాబాద్, బెంగళూరుల్లోనూ ఆంధ్రుల హవానే అధికం. కానీ రాష్ట్రంలో ఐటీ పరిస్థితి మాత్రం దారుణం. జగన్ ప్రభుత్వానికి ఇది ప్రయారిటీ లేని రంగం. నోటితో మాటలు చెప్పడమే తప్ప... చేతితో రూపాయి ఇచ్చింది లేదు. వైసీపీ అధికారంలోకి రాక ముందు విశాఖలో ఐటీ ఉజ్వలంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వం పెట్టిన పాలసీ ప్రోత్సాహకరంగా ఉండడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ కంపెనీలు ఏర్పాటుచేశారు. జగన్ ప్రభుత్వం ఆ పాలసీని పక్కనపెట్టి, రాయితీలు ఇవ్వకపోవడంతో ఐటీ రంగం తిరోగమనం పట్టింది.

నవ్యాంధ్రప్రదేశ్‌లో సిలికాన్ ఆఫ్ ఆంధ్రాగా పేరొందిన విశాఖపట్నం ఇప్పుడు వెలవెలబోతోంది. ప్రముఖ కంపెనీలన్నీ పారిపోయాయి. అమెరికా సంస్థ కాండిలిటిస్ దుకాణం మూసేసింది. హెచ్ఎస్‌బీఎస్ దండం పెట్టేసింది. మానవ వనరుల్ని అందించే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఎడెక్కో కూడా చెక్కేసింది. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ముఖం చాటేసింది. ఫిన్‌టెక్ సిటీలో పేటీఎం పారిపోయింది. ఈ దుస్థితికి కారణం ఏమిటని ఎవరిని ప్రశ్నించినా జగన్ సర్కారే కారణమని ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగానికి సరైన పాలసీ లేదు. ప్రోత్సాహకాలు లేవు. ఎకో సిస్టమ్ లేదు. అదే శాపంగా పరిణమించింది.

ఐటీ పార్కులో భవనాలన్నీ ఖాళీ

రుషికొండ (మధురవాడ)లో మూడు కొండలపై 2005లో ఐటీ పార్కు ఏర్పాటుచేశారు. హిల్ నంబరు-1లో మిరాకిల్, ఫినెక్స్ కంపెనీలు నడుస్తున్నాయి. హిల్ నంబరు 2లో సుమారు 21 కంపెనీలకు స్థలాలు ఇచ్చారు. అందులో ఎనిమిది కంపెనీలే పనిచేస్తున్నాయి. ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో పలు కంపెనీలు ఖాళీ చేసి వెళ్లిపోయాయి. చంద్రబాబు హయాంలో ఇదే కొండపై బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, నగదు రహిత లావాదేవీల అభివృద్ధికి 'ఫిన్‌టెక్ సిటీ' ఏర్పాటు చేశారు. ఇప్పుడు మూతపడింది. అందులో పేటీఎం వెళ్లిపోయింది. హిల్ నంబరు-3పై చంద్రబాబు హయాంలోనే సన్‌రైజ్ స్టార్టప్ విలేజ్ ప్రారంభించారు. ప్రోత్సహించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అందరినీ ఖాళీ చేయించి పంపించేసింది. నాలుగేళ్లు గోళ్లు గిల్లుకొని ఏడాది క్రితం నుంచి దానిని ముందుకు తోయడానికి యత్నిస్తున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే ఇక్కడ మిలీనియం టవర్-ఏ ప్రారంభించారు. ఎనిమిది అంతస్థుల భవనంలో నాలుగు అంతస్థుల్లో అంతర్జాతీయ కంపెనీ కాండ్యుయెంట్ ప్రారంభించారు. అదే ఆఖరు. ఆ తరువాత మరొక కంపెనీ రాలేదు. పై నాలుగు అంతస్థులు కూడా తమకు అద్దెకు ఇవ్వాలని కాండ్యుయెంట్ కోరుతున్నా ఇవ్వకుండా ఐదేళ్లుగా ఖాళీగా ఉంచారు. అది కూడా ఇస్తే మరో 500 మందికి ఉద్యోగాలు వచ్చి ఉండేవి. ఏడాది క్రితమే మిలీనియం టవర్-బీ పూర్తయింది. అందులో మరో ఎనిమిది అంతస్థులు ఉన్నాయి. ఒక్కరికి కూడా దానిని కేటాయించలేదు. పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తే ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఖాళీగా ఉంచారు.

హైకోర్టు ఆదేశించినా...

వైసీపీ ప్రభుత్వం ఐటీ కంపెనీలకు రూపాయి రాయితీ ఇవ్వలేదు. సుమారు రూ.100 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. తొలి విడతగా రూ.22 కోట్లు ఇస్తామని చెప్పి మూడేళ్లయింది. ఇక్కడి నాయకుడే ఐటీ మంత్రి అయినా ఇప్పించలేకపోయారు. కడుపు మండిన ఓ సంస్థ హైకోర్టులో రాయితీ కోసం కేసు వేయగా వెంటనే ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. దీనిపై కోర్టు ధిక్కారం కేసు వేసినా స్పందన శూన్యం.


హెచ్ఎస్‌బీసీ

కేంద్ర పథకాలతో విస్తరణ...రాష్ట్రం సోకు

కేంద్ర ప్రభుత్వం బీపీఓ సంస్థలకు ఎస్‌టీపీఐ ద్వారా మంచి ప్రోత్సాహకాలు ఇస్తోంది. వాటిని విశాఖలోని పాత్ర, డబ్ల్యుఎన్ఎస్ సంస్థలు ఉపయోగించుకొని విస్తరణకు వెళ్లాయి. చెరో రెండు వేల మందికి ఉపాధి కల్పించాయి. ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకొని ఐటీని ఉద్ధరిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ మంత్రి ప్రచారం చేసుకున్నారు.

కాపులుప్పాడలో గబ్బు పట్టిన ఐటీ లేఅవుట్

టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ ఐటీ శాఖ మంత్రిగా ఉండగా కాపులుప్పాడలో కొండపై రూ.70 కోట్లతో 250 ఎకరాల్లో ఐటీ లేఅవుట్ ఏర్పాటుచేశారు. అందులో 77 ఎకరాలు ఐటీ కంపెనీల కోసం రిజర్వు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆ లేఅవుట్‌లో కనీసం గజం స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదు. ఖాళీగా ఉంచేసింది. ఇక్కడ ఇంత స్థలం ఉంచుకొని కొత్తగా భోగాపురంలో 90 ఎకరాల్లో ఐటీ పార్కు పెడుతున్నామని, అక్కడకు రావాలని కోరుతోంది. ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి ఐటీ ప్రతినిధులు విస్తుపోతున్నారు.

సాయం అందించని పాలసీ

రాష్ట్రం నుంచి స్టార్టప్‌లు పారిపోయాయని ఆలస్యంగా గుర్తించిన ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రకటించిన ఐటీ పాలసీలో 'యాక్సిలరేట్ స్టార్టప్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (ఎసాప్)' పేరుతో కొత్త పథకం తీసుకువచ్చింది. వెంచర్ కేపిటలిస్టులతో రూ.100 కోట్లతో మూలధనం పెట్టిస్తామని ప్రకటించింది. ప్రైవేటు సంస్థలు, యూనివర్సిటీలను అనుసంధానం చేస్తామని కూడా చెప్పింది. కానీ ఆచరణలోకి చూపలేదు. ఒక్క కొత్త స్టార్టప్‌ను ఏర్పాటుచేయలేదు. బయట స్టార్టప్‌లను తీసుకువచ్చి వారితో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ నింపేశారు.

స్థానిక కంపెనీలకు దక్కని ప్రాజెక్టులు

రాష్ట్రంలో ఐటీ కంపెనీలను ప్రోత్సహించాలనేది ఉద్దేశంతో 'ప్రిఫరెన్షియల్ మార్కెట్ యాక్సెస్ (పీఎంఏ)' స్కీమ్ ఒకటి గత ప్రభుత్వం తీసుకువచ్చింది. దాని ప్రకారం ప్రభుత్వానికి సంబంధించిన ఐటీ పని ఏదైనా స్థానిక కంపెనీలకు ఇవ్వాలి. వీరు చేయలేని భారీ ప్రాజెక్టులు ఏమైనా ఉంటే వాటిని ఇతర ప్రాంతాల్లోని వారికి ఇచ్చుకోవచ్చు. దీని కోసం ఒక పోర్టల్ పెట్టి ఐటీ కంపెనీల పేర్లను కూడా నమోదు చేసుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక సుమారు 50కి పైగా ఐటీ సాఫ్ట్‌వేర్లు తీసుకొన్నారు. ఇసుక అమ్మకాలకు ఒక వెబ్‌సైట్ పెట్టారు. వార్డు వలంటీర్ల కోసం సాఫ్ట్‌వేర్ తీసుకున్నారు. పౌర సరఫరాల శాఖలో రేషన్ పంపిణీ కోసం, నెల నెలా మొదటి వారంలోనే పించన్ల పంపిణీ, ఇసుక అమ్మకాలు, మద్యం దుకాణాల నిర్వహణ...ఇలా అనేక శాఖల్లో ఐటీ అవసరాల కోసం సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు తీసుకున్నారు. ఈ పనుల కోసం ఎక్కడా ప్రకటనలు ఇవ్వలేదు. టెండర్లు ఆహ్వానించలేదు. పీఎంఏలో పేర్లు నమోదు చేసుకున్న వారికి సమాచారం లేదు. నచ్చిన వారికి ఆ పనులు అప్పగించుకున్నారు. ఆపదలో ఉన్న మహిళల కోసం ప్రభుత్వం పెట్టిన 'దిశ' యాప్‌ను భువనేశ్వర్‌లో ఉన్న కంపెనీకి అప్పగించారు.

కేంద్రం ప్రాజెక్టుకు నిధులు లేవు

స్టీల్‌ప్లాంటులో 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఆన్ ఇండస్ట్రీ 4.0' పేరుతో ఓ ఐటీ కేంద్రాన్ని పెట్టారు. దీని వ్యయం రూ.20.32 కోట్లు కాగా, స్టీల్‌ప్లాంటు తొమ్మిది కోట్ల రూపాయలు సమకూర్చింది. కేంద్ర ఐటీ శాఖ రూ.8.32 కోట్లు అందించింది. ఎస్‌టీపీఐ కోటి రూపాయలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2 కోట్లు ఇవ్వాల్సి ఉంది. రూపాయి కూడా ఇవ్వలేదు.

సెజ్ పేరు మార్చేశారు

విశాఖకు 20 కి.మీ. దూరంలో ఆనందపురం మండలంలో జాతీయ రహదారి పక్కనే గంభీరంలో 2009లో 51 ఎకరాల్లో ఐటీ సెజ్ ఏర్పాటుచేశారు. అందులో కొంత స్థలం ఐటీ కంపెనీలకు కేటాయించారు. ఆ తరువాత రద్దు చేశారు. ఇప్పుడు ఐటీ సెజ్ అని పేరు కూడా తీసేశారు.

డిజిటల్ లైబ్రరీలు ఎక్కడ?


ఆరు నెలల్లో అన్ని గ్రామాలకు ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించి డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటుచేస్తామని ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఏడాదిన్నర క్రితం ప్రకటించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో మల్టీనేషనల్ కంపెనీలకు పనిచేస్తున్నవారు నేరుగా ఆ లైబ్రరీలకు వెళ్లి కోవర్కింగ్ కింద పనిచేసుకోవచ్చునన్నారు. ఇలా రాష్ట్రంలో 15 వేల డిజిటల్ లైబ్రరీలు వస్తాయని, వాటికి అవసరమైన నెట్‌వర్క్ కోసం రూ.250 కోట్ల నుంచి రూ.500 కోట్లు వెచ్చించబోతున్నామని చెప్పారు. ఆయన చేతుల మీదుగా ఒక్క డిజిటల్ లైబ్రరీ కూడా ప్రారంభించలేకపోయారు.

పెట్టుబడులపై తప్పుడు ప్రచారం

విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించి చేసుకున్న ఒప్పందాల్లో 85 శాతం పెట్టుబడులు వచ్చేశాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విభాగంలో 88 ఎంఓయూలు చేసుకొని రూ.44,963 కోట్లు పెట్టుబడులు తేవాలనేది లక్ష్యం. అందులో రూ.38,573 కోట్ల విలువైన పరిశ్రమలు వచ్చాయంటున్నారు. ఏ పరిశ్రమలు వచ్చాయో, ఎంతమందికి ఉపాధి కల్పించారో ఎక్కడా చెప్పడం లేదు. విశాఖలో అదానీ డేటా సెంటర్ పెట్టుబడి రూ.21,844 కోట్లు. దీనికి గత మే నెలలో శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకూ ఎటువంటి పనులు చేపట్టలేదు. అదానీ డేటా సెంటర్‌కు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భూమి కేటాయించింది. వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసి, తిరిగి మళ్లీ ఒప్పందం కుదుర్చుకుంది.

ఎప్పటినుంచో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారిలో కూడా పోలింగ్ కేంద్రంలోకి అడుగుపెట్టే ముందు నుంచే పలు రకాల అనుమానాలు. లోపలకు వెళ్లి ఎవరిని కలవాలి?, ఎలా ఓటేయాలి?...అనే సందేహాలు. అటువంటిది మొదటిసారి ఓటు వేయడానికి వెళ్లేవారు, నిరక్షరాస్యుల గురించి చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో ఓటరు తన ఓటు ఏ విధంగా వినియోగించుకోవాలో అవగాహన కల్పించేందుకు అందిస్తున్న కథనం..

ఓటు ఇదిగో రూటు



1 ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన స్లిప్పులను తీసుకుని నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లోని బూత్‌ల వద్దకు వెళ్లాలి. ఏడు గంటల నుంచే బూత్‌లన్నీ సిద్ధంగా ఉంటాయి. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటు వేయవచ్చు. అయితే ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు గంటలతో గడువు ముగుస్తుంది.

2 పోలింగ్ బూత్ బయట వుండే సెక్యూరిటీ అధికారి ఓటరు గుర్తింపు కార్డును చూసి బూత్‌లోకి అనుమతిస్తారు. ఓటరు తీసుకువచ్చిన గుర్తింపు కార్డు ఆధారంగా మొదటి పోలింగ్ ఆఫీసర్ (ఏపీవో) ఓటరు పేరును బయటకు వినపడేలా చదువుతారు. ఓటరు లిస్టులోని పేరు, ఫొటోను పరిశీలించి రౌండప్ చేసి ఓటేసేందుకు అనుమతిస్తారు.

3 అక్కడ రెండో పోలింగ్ అధికారి ఉంటారు. ఆయన తన దగ్గర ఉన్న సిరాకు, స్లిప్పుకు ఇన్‌చార్జ్‌గా ఉంటారు. తన దగ్గర వున్న లిస్టులో ఓటరు వివరాలు చూసి స్లిప్‌ను అందించి చూపుడు వేలికి సిరా గుర్తువేస్తారు. చివరగా ఓటరు వద్ద నుంచి సంతకాన్ని తీసుకుంటారు.

4 అక్కడ మూడు, నాలుగు పోలింగ్ అధికారులు ఉంటారు. మూడో పోలింగ్ ఆఫీసర్ ఓటరు వద్ద నుంచి ఓటరు స్లిప్పును తీసుకుని ఓటు వేసేందుకు లోపలకు పంపిస్తారు. మూడో పోలింగ్ అధికారి పార్లమెంట్ ఈవీఎం కంట్రోల్ యూనిట్‌కు ఇన్‌చార్జ్‌గా వుంటే, నాలుగో పోలింగ్ అధికారి అసెంబ్లీ ఈవీఎం కంట్రోల్ యూనిట్‌కు ఇన్‌చార్జిగా ఉంటారు. మొదట ఎంపీ అభ్యర్థికి (తెలుపు రంగు) ఓటేసేందుకు పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లినప్పుడు మూడో పోలింగ్ అధికారి పార్లమెంటు ఈవీఎం కంట్రోల్ యూనిట్‌ను ఆన్ చేస్తారు. ఆ తరువాత అసెంబ్లీ అభ్యర్థికి (గులాబీ రంగు) ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు ఆ యూనిట్ ఇన్‌చార్జి తన వద్ద వున్న కంట్రోల్ యూనిట్‌ను ఆన్ చేసి ఓటేసేందుకు అనుగుణంగా సిద్ధం చేస్తారు.

మీకు నచ్చిన అభ్యర్థి / గుర్తు ఎదురుగా కుడి వైపు కనిపిస్తున్న నీలం రంగు బటన్‌ను నొక్కితే ఓటు వేసినట్టే..

5 పోలింగ్ కంపార్ట్‌మెంటులోకి వెళ్లేసరికి ప్రిసైడింగ్ ఆఫీసర్ మీ బ్యాలెట్‌ను సిద్ధంగా ఉంచుతారు. బ్యాలెట్ యూనిట్‌పైన మీకు నచ్చిన అభ్యర్థి పేరు, పార్టీకి సంబంధించిన గుర్తు ఎదురుగా నీలి రంగు (బ్లూ) బటన్ ఉంటుంది. దానిని గట్టిగా నొక్కాలి. వెంటనే బీప్ శబ్దం వస్తుంది. ఈ విధంగా చేసిన వెంటనే అభ్యర్థి పేరు, గుర్తు ఎదురుగా ఉండే రెడ్‌లైట్ వెలుగుతుంది. అసెంబ్లీ అభ్యర్థికి కూడా ఇదే విధంగా ఓటు వేయాల్సి ఉంటుంది. ఈవీఎం పక్కనే వీవీ ప్యాట్ అనే మరో పరికరం ఉంటుంది. ఓటు వేసిన వెంటనే దీనిని చూస్తే మనం అనుకున్న అభ్యర్థికి ఓటు పడిందో లేదో తెలుసుకోవచ్చు. ఈ బ్యాలెట్ స్లిప్ ఏడు సెకండ్లపాటు ఓటరు ఓటు వేసిన అభ్యర్థి గుర్తును చూపించి ఆ తరువాత కట్ అయ్యి ప్రింటర్ డ్రాప్ బాక్స్‌లో పడుతుంది. బీప్ అనే శబ్దం వినపడకపోయినా, వీవీ ప్యాట్‌లో కనిపించకపోయినా పోలింగ్ ఆఫీసర్‌ను అడగవచ్చు. ముందు పార్లమెంట్ అభ్యర్థికి, అనంతరం అసెంబ్లీ అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. ఇక్కడితో ఓటు వేసే ప్రక్రియ ముగిసినట్టు.

సెల్‌ఫోన్‌ను అనుమతించరు



- పోలింగ్ బూత్‌లో వుండే ప్రిసైడింగ్ ఆఫీసర్ మొత్తం ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తుంటారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడడంతోపాటు మాక్ పోలింగ్ నిర్వహణ వంటి ప్రక్రియను ఈయన ఆధ్వర్యంలోనే పూర్తిచేస్తారు.
- ఓటు వేసేందుకు వచ్చే ఓటరు తన వద్ద స్లిప్పు లేకపోయినా పోలింగ్ కేంద్రానికి వచ్చి బయట వుండే బీఎల్‌వో దగ్గర స్లిప్పు తీసుకుని ఓటేయవచ్చు.
- ఓటు వేయడానికి అవసరమైన ఓటరు ఐడీ కార్డు తప్పనిసరి కాదు. మరో 11 రకాల గుర్తింపు కార్డులను తీసుకువచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటర్ ఐడీ కార్డు, స్మార్ట్ కార్డు, పాస్‌పోర్టు, గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్త్ ఇన్సురెన్స్ స్మార్ట్ కార్డు, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, పాస్ బుక్, అధికారిక గుర్తింపు కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డును తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.
- పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్, వాటర్ బాటిల్స్, ఇతర తినుబండారాలను అనుమతించరు. పోలింగ్ బూత్‌లోనే మంచి నీటి సదుపాయం కల్పిస్తారు.
- ప్రతి పార్టీ అభ్యర్థికి సంబంధించి ఏజెంట్‌లు పోలింగ్ బూత్‌లు అందుబాటులో ఉంటారు.

వివిధ రకాల ఓట్లకు అవకాశం

- పోలింగ్ కోసం వచ్చే ఓటర్లు తమ ఓటు లేకపోతే చాలెంజ్ ఓటు వేయడానికి అవకాశం ఉంది. జాబితాలో పేరుండి, లోపలికి వెళ్లినప్పుడు అధికారులు జాబితా చూసి అందులో ఓటు వేసినట్టు టిక్కు ఉంటే ఓటరు చాలెంజ్ ఓటు వేయవచ్చు.
- ఇందుకోసం రూ.2 చెల్లించి ఫారంపై సంతకం చేస్తే, అతనికి ప్రిసైడింగు అధికారి మళ్లీ కొత్త ఓటు ఇచ్చి వేయిస్తారు.
- ఓటరు వయసు గురించి అధికారులకు అనుమానం వస్తే తన వయసుకు సంబంధించిన ధ్రువీకరణ అందించాల్సి ఉంటుంది.

ఏయూకు రాజకీయ చెద!

ఐదేళ్లలో వర్సిటీ ఖ్యాతిని మంట గలిపిన వైసీపీ ప్రభుత్వం

- అడ్డగోలు నియామకాలు... అస్మదీయులకు పదవులు
- తప్పుడు నిర్ణయాలతో ఏయూ పరువును భ్రష్టుపట్టించిన పాలకులు

- వర్సిటీ కేంద్రంగా అధికార పార్టీ కార్యకలాపాలు
- వీసీ ఛాంబర్‌లోనే వైసీపీ ప్రముఖుల జన్మదినోత్సవాలు
- అధికార పార్టీ సేవలో తరించిన ఇతర అధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైసీపీ పాలనలో రాజకీయ చెద పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాలు వర్సిటీ ఖ్యాతిని మంటగలిపాయి. ముఖ్యంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ఏయూలో జగన్, విజయసాయిరెడ్డి తదితరుల పుట్టినరోజు కార్యక్రమాల నిర్వహణతో వర్సిటీ రాజకీయ కేంద్రంగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపేందుకు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పోటీ పడ్డారు. ఈ తతంగం సుమారు మూడు నెలలు కొనసాగింది. నిత్యం వచ్చి, పోయే వైసీపీ నాయకులతో వర్సిటీ వైసీపీ కార్యాలయాన్ని తలపించేది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చినా వీసీ కనీసం పట్టించుకోలేదు. ఆ తరువాత కూడా వైసీపీ నేతల రాకపోకలు కొనసాగాయి. దీంతో వీసీ చాంబర్ అధికార పార్టీ కార్యాలయంగా మారిందన్న విమర్శలు వచ్చాయి. అందుకు తగ్గట్టుగానే వీసీ ప్రవర్తన కొనసాగింది. వైసీపీ గౌరవాధ్యక్షురాలిగా వ్యవహరించిన వైఎస్ విజయలక్ష్మి, సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను వీసీ ఛాంబర్‌లో నిర్వహించేవారు. వర్సిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. డీజే సౌండ్స్, బాణసంచా మోతలతో హోరెత్తించారు. గతంలో ఇలాంటి సంస్కృతి లేదని సీనియర్ ప్రొఫెసర్లు చెబుతున్నారు.

విద్యార్థులకు దూరంగా వీసీ

సాధారణంగా వీసీ విద్యార్థులకు అందుబాటులో ఉండి, వారి యోగక్షేమాలపై దృష్టి సారించాలి. సమస్యలను వివరించేందుకు అవకాశమివ్వాలి. వాటిని సత్వరం పరిష్కరించాలి.కానీ ప్రసాదరెడ్డి ఈ తరహా వ్యవహారాలకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. విద్యార్థులు వీసీని కలిసే అవకాశమే లేకుండా తన కార్యాలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. సెక్యూరిటీ అనుమతి లేకుండా ఎవరూ లోనికి వెళ్లలేని స్థితి కల్పించారు. అంతేకాదు సమస్యలపై గత ఐదేళ్లలో విద్యార్థులు వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టే సాహసం కూడా చేయకుండా రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

అడ్డగోలు నియామకాలకు అడ్డా...

గడిచిన ఐదేళ్లలో విశ్వవిద్యాలయంలో అనేక అడ్డగోలు నియామకాలు జరిగాయి. అస్మదీయులైన వారికి ఉన్నత పదవులు కట్టబెట్టారన్న విమర్శలున్నాయి. గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రొఫెసర్ కృష్ణమోహన్‌కు నిబంధనలకు విరుద్ధంగా మూడుసార్లు పొడిగింపు ఇచ్చారు. తాజాగా ఆ పదవిని నిబంధనలకు విరుద్ధంగా మరొకరికి కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నియామకంపై విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాయి. అలాగే విశ్రాంత అధికారులకు కూడా వీసీ అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. అనేక మంది మాజీలను కీలక పోస్టుల్లో కూర్చోబెట్టారు. అనుయాయులను గెస్ట్ ఫ్యాకల్టీలుగా, అడ్జెంక్ట్ ప్రొఫెసర్లుగా నియమించారు. వర్సిటీలో వీరి సంఖ్య 30 వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇక పీహెచ్‌డీ పట్టాల ప్రదానంపై ఓ సీనియర్ ప్రొఫెసర్ మీడియా ముఖంగా విమర్శలు చేయడం గమనార్హం.

అసాంఘిక ముద్ర..

వర్సిటీలోని నార్త్ క్యాంపస్ పరిధిలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో చిట్టడవిని తలపించేలా వేలాది వృక్షాలు ఉండేవి. వాటిని నిబంధనలకు విరుద్ధంగా, అటవీ శాఖ అనుమతి లేకుండా తొలగించారని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అంతేకాదు ఈ ప్రాంతంలో చెరువులు, ఇంకుడు గుంతలను కప్పేశారని కూడా విమర్శలున్నాయి. దీంతో అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వందలాదిగా కుప్పపోసిన కండోమ్ ప్యాకెట్ల ఫొటోలు, వీడియోలను ఏయూ అధికారులు మీడియాకు విడుదల చేశారు. ఈ వ్యవహారం వర్సిటీ ప్రతిష్ఠను మరింతగా మంటగలిపింది.

కలకలం రేపిన గంజాయి

వర్సిటీ విద్యార్థుల వద్ద గంజాయి లభించడం, సెక్యూరిటీ సిబ్బందే గంజాయి విక్రయిదారులుగా వ్యవహరించడం కలకలం రేపాయి. రెండేళ్ల కిందట గంజాయి వ్యవహారంలో విద్యార్థులు కొట్లాటకు దిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తాజాగా మరికొందరు గంజాయితో దొరికారు. ఇవన్నీ వర్సిటీ సెక్యూరిటీ పనితీరును ప్రశ్నిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం వీటిపై కఠినంగా ఉన్నామని చెబుతున్నా- క్షేత్రస్థాయిలో విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయి.

వైఎస్ విగ్రహం ఏర్పాటు

గతంలో ఏయూ క్యాంపస్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఏడాది కిందట పాత విగ్రహాన్ని తొలగించి మరో భారీ విగ్రహాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. దీనిపైనా విమర్శలు వచ్చాయి. విద్యా రంగ అభివృద్ధి కృషిచేసిన వారి విగ్రహాలను నెలకొల్పాల్సిన చోట...రాజకీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడమేమిటన్న ప్రశ్నలు వర్సిటీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ సేవలో వీసీ

వైస్ చాన్సలర్‌గా ప్రసాదరెడ్డి అధికార పార్టీకి తన పరిధికి మించి మేలు చేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాలపై విద్యార్థులతోనే సర్వే చేయించి అధికార పార్టీ పెద్దలకు అందించారు. ఆ ఎన్నికల్లో కొంతమందికి టికెట్లు ఇప్పించారనే ప్రచారం కూడా ఉంది. తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఓ వార్డు కార్పొరేటర్‌కు అనుకూలంగా వీసీ ప్రచారంలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థికి ఓట్లు వేయించేందుకు ఏయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఓ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో వీసీ వెనుక నుంచి వెళ్లిపోయారు. తాజాగా సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీకి మేలు చేసేందుకు వీసీ తనదైన శైలిలో ప్రయత్నాలు సాగిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా ఐదేళ్లలో వైస్ చాన్సలర్‌గా రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న ప్రసాదరెడ్డి... వైసీపీ నాయకుని మాదిరిగా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమికే మాదిగల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సబ్బవరం, మే 11: కూటమి ప్రభుత్వంతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు జి.స్మ్రాట్‌కుమార్ అన్నారు. శనివారం ఇక్కడ రెల్లి హక్కుల పోరాట సమితి నాయకులతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్రాట్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా మంద కృష్ణమాదిగ తీసుకున్న నిర్ణయం తమకు శిరోధార్యం అన్నారు. రాజకీయంగా మాదిగల మధ్య చిచ్చు పెట్టడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారిని సహించేంది లేదన్నారు. రెల్లి సంఘం నాయకులు బి.అప్పారావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ చేస్తుందన్న నమ్మకం రెల్లి, మాదిగ ఉపకులాలకు ఉందన్నారు. కార్యక్రమంలో గొటివాడ అప్పారావు, వంగలిపూడి సంతోష్‌బాబు, అయినింటి రాజు, పెట్ల ఈశ్వరరావు, డొక్కా భాస్కరరావు, నిమిడితల్లి సోమేశ్వరరావు, ఇందుగుబిల్లి పరదేశి పాల్గొన్నారు.

కోటవురట్లలో ముమ్మరంగా శానిటేషన్ పనులు



డ్రైనేజీల్లో పూడిక తీస్తున్న సిబ్బంది

కోటవురట్ల, మే 11: మండల కేంద్రంలో శానిటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కోటవురట్ల మేజర్ పంచాయతీకార్యదర్శిగా వెంకట శ్రీనివాసరావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ముఖ్యంగా పారిశుధ్యంపైనే ఫిర్యాదులు అధికంగా రావడంతో ఆయన ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వారం రోజుల నుంచి చెత్తచెదారాన్ని ప్రత్యేక సిబ్బందితో తొలగిస్తున్నారు. పంచాయతీలోని 9 నీటి పథకాలను క్లోరినేషన్ చేయించారు. అలాగే కోటవురట్ల సంతబయల, బీసీకాలనీ, సీతారామరాజుకాలనీ, రాట్నాలపాలెం ఎస్సీకాలనీ, గొల్లపేట వీధులను శుభ్రం చేయిస్తున్నారు.

పోలింగ్ ఏర్పాట్లు పూర్తి



నక్కపల్లిలో పోలింగ్‌కు సరంజామా సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కోసం షెడ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, మే 11: ఈనెల 13న పోలింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.గీతాంజలి చెప్పారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో వున్న 292 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని ఆదివారం ఉదయం నుంచి తరలిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి అవసరమైన బస్సులు, మినీ వ్యాన్‌లు, ఇతర వాహనాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకున్న వారి పేర్లను ఓటర్ల జాబితాల్లో మార్కింగ్ చేశామని చెప్పారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తు నడుమ ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు తగిన వాహనాలను సర్వం సిద్ధం చేశారు. ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయానికే సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. శుక్రవారం ఎలమంచిలిలో కుండపోత వర్షం కురవడంతో క్రీడామైదానం అసౌకర్యంగా తయారవ్వడంతో అధికారులు వెంటనే బాగు చేయించారు. రిటర్నింగ్ అధికారి మనోరమ ఆర్వో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

హోరెత్తిన కూటమి ప్రచారం

సబ్బవరం, మే 11 : మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు శనివారం నిర్వహించిన ఇంటింటా ప్రచారంతో ఆయా గ్రామాలు హోరెత్తాయి. సబ్బవరం శివారు గొర్లివానిపాలెం, గోపాల్‌నగర్, చినగొల్లపాలెం, పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెంతోపాటు ఇరువాడ, అసకపల్లి, పైడివాడ, పైడివాడఅగ్రహారం, బంగారమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, టెక్కలిపాలెం, వంగలి, ఆర్లీఅగ్రహారం, అమృతపురం, మొగలిపురం, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదివలస, బాటజంగాలపాలెం, నారపాడు, అంతకాపల్లి, అయ్యన్నపాలెం, గొటివాడ, అసకపల్లి తదితర గ్రామాల్లో కూటమి కార్యకర్తలు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు గుర్తు గాజుగ్లాసు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ గుర్తు కమలంపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోన సోమేశ్వరరావు, పల్ల తాతారావు, బర్ల రమణ, కొరాడ శ్రీను, అక్కుబాబు, గెడ్డం రమేశ్, చింతల శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

మండలంలోని నల్లరేగులపాలెం, నారపాడు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. నల్లరేగులపాలెం వార్డు మెంబరు కాయిత రమణ, అతని కుటుంబ సభ్యులు, అనుచరులు, నారపాడుకు చెందిన రాజాన వెంకన్న, అతని కుటుంబ సభ్యులకు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి భరిణికాన బాబూరావు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణరాజు, గొలగాన అప్పారావు, ఎం.సత్యనారాయణ, జె. రాము, రాజాన శ్రీను, ఎం. ఆనంద్, బర్ల ముత్యాలు, రాజాన శ్రీను, బొట్టా వెంకట్, ఈగల వెంకట్, నామాల అప్పారావు, గణేష్ పాల్గొన్నారు.



సబ్బవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

వాడచీపురుపల్లిలో ఎన్నికల ప్రచారం

పరవాడ, మే 11 : కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శనివారం వాడచీపురుపల్లిలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక గంగిరెడ్ల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల్లో జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపై, బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ ఉపసర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, సన్నిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పేట'లో ముగిసిన ఎన్నికల ప్రచారం

పాయకరావుపేట, మే 11: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ పార్టీల అభ్యర్థుల ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. దీంతో పట్టణంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పాయకరావుపేట అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీతోపాటు అన్ని పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. వాహనాలకు జనరేటర్లు, డీజే సౌండ్, డిజిటల్ సిస్టమ్ ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. ఇప్పటి వరకు అభ్యర్థులు నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు అయితే ఇక నుంచి పోలింగ్ నిర్వహించే సమయం వరకు జరిపే తెరచాటు వ్యవహారాలే ఎక్కువగా ప్రభావం చూపే అవకాశముంది. రెండు రోజుల ముందు నుంచే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రలోభాల పర్వానికి ప్రధాన పార్టీలు తెరతీశాయి.

మండలంలో ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు

పాయకరావుపేట, మే 11 : మండలంలో ఈనెల 13న జరగనున్న ఎన్నికలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం 78,427 మంది ఓటర్లు ఉండగా.. 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్డి, దివ్యాంగుల కోసం ర్యాంపులు తదితర ఏర్పాటు చేశారు. పాయకరావుపేట పట్టణంలో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ఇప్పటివరకు 90 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన 10 శాతం ఆదివారం సాయంత్రానికి పూర్తవుతుందన్నారు.

మందు చూపు!

... 5వ పేజీ తరువాయి

దొండపూడి, కొత్తకోటలో ఉన్న మద్యం దుకాణాల వద్ద ఎండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి వేచి ఉన్నారు. గత రెండు రోజులుగా అధికార పార్టీ నేతలు డబ్బులు పంపిణీ చేయడంతో మందుబాబు జోష్ మీద ఉన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: పట్నంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు శనివారం కిటకిటలాడాయి. షాపులు తెరవక ముందే క్యూలో ఉన్న మందుబాబులు తెరిచిన తరువాత మద్యం కోసం ఎగబడ్డారు. ధనిమిరెడ్డివీధి, చింతపల్లి రోడ్డులో ఉన్న రెండు మద్యం దుకాణాల వద్ద తోపులాట కనిపించింది. ఎన్నిక నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటలకు ఎక్సైజ్ అధికారులు మద్యం షాపులు సీజ్ చేయనుండగా, సరకు నిల్వ చేసుకోవడానికి మందుబాబులు ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద క్యూ కట్టారు. మంగళవారం వరకు సరిపోయే విధంగా ఎగబడి మద్యం కొనుగోలు చేశారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రకారం గత ఏడాది ఈ రోజున ఎంత సరకు విక్రయించారో అంత విక్రయించిన తరువాత దుకాణాలను మూసి వేయాల్సి ఉంది. దుకాణం తెరిచిన రెండు గంటల్లోనే సరకు అయిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంటకు చింతపల్లి రోడ్డులోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

ఓటర్లకు ఎర

... 5వ పేజీ తరువాయి

నాయకులు పంపిణీ చేస్తున్న మద్యాన్ని మంద ుబాబులు తాగుతున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లోనే నాసిరకం సరకు దొరుకుతుంటే ఇప్పుడు ఓటర్లకు పంపిణీ చేస్తున్న మద్యం అంతకన్నా నాసిరకమని అంటున్నారు. ఎమ్మార్పీయే పాతిక రూపాయలుంటే, హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తే మరింత తక్కువ ధరకు వస్తుంది. ఆది, సోమవారాల్లో కూడా ఇదే మద్యం పంపిణీ చేయడానికి ఇరు పార్టీలు సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. అధికార పార్టీకి లభించినంత గోవా మద్యం.. కూటమి అభ్యర్థులకు దొరకలేదు. కూటమి శ్రేణులు సాధారణ షాపుల్లో దొరికే మద్యాన్నే పంపిణీ చేస్తున్నట్టు సమాచారం.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

▸▸ గవరపాలెంలో రత్నాకర్ ఆధ్వర్యంలో ప్రచారం



సంతబయలులో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, మే 11 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు సీఎం రిత్విన్ ఎన్నికల ప్రచారంలో గడప గడపకు తిరిగి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, అసెంబ్లీ అభ్యర్థి అయిన తనకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కొణతాల రామకృష్ణ ప్రజలను కోరారు. ముందుగా పెదరామస్వామి ఆలయంలో సీతారాములను నాయకులు దర్శించుకున్నారు. అనంతరం సంతబయలు, దాడి వారివీధి, కర్రి పెద్దయ్యవీధి, విజ్ఞాన సమితి, శాంతినగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. బ్యాలెట్ నమూనాలతో ఓటర్లకు అర్థమయ్యే రీతిలో ఓటు వేసే విధానం గురించి వారు వివరించారు. కార్యక్రమంలో దాడి జగన్ ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, కొణతాల రాజేంద్ర, మళ్ల రాజా, కర్రి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 30 మంది యువకులు చేరిక



టీడీపీలో చేరిన యువకులతో పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, మే 11 : స్థానిక రౌతు వీధికి చెందిన 30 మంది యువకులు, మహిళలు తెలుగుదేశం పార్టీలో శనివారం చేరారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన

▸▸ నోడల్ అధికారి రమామణి



అధికారులకు సూచనలిస్తున్న రమామణి

అనకాపల్లి టౌన్, మే 11 : అనకాపల్లిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వాలని నోడల్ అధికారి కె. రమామణి స్పష్టంచేశారు. శనివారం ఆమె పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై తనిఖీలు చేశారు. అదేవిధంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోని ఆరు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఇక్కడ గదులు ఇరుకుగా ఉండడంతో లోపల ఉన్న ఫర్నీచర్‌ను తొలగించి ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు సూచించారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈమె వెంట జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

'13న ఉద్యోగ, కార్మికులకు సెలవు ప్రకటించాలి'

పరవాడ, మే 11 : ఈనెల 13న జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును ఉద్యోగ, కార్మికులు ఉపయోగించుకోవడానికి సెలవు ప్రకటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ, ఫార్మా పరిశ్రమలు, రాంకీ ఎస్‌ఈజెడ్, ఇండస్ట్రియల్ పార్కు, లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్, జిల్లాలోని షాపులు, షాపింగ్‌మాల్స్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు సెలవు ప్రకటించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో డైట్‌కు మూడో స్థానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వైకుంఠరావు

అనకాపల్లి టౌన్, మే 11 : ఎస్ఎస్‌టీఎల్‌లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో డైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మూడో స్థానం సంపాదించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు తెలిపారు. మూడు రోజులు పాటు ఎస్ఎస్‌టీఎల్ డీఆర్‌డీవోలో జరిగిన సాంకేతిక దినోత్సవాలు శనివారం ముగిశాయన్నారు. ఈ ప్రదర్శనకు 115 ప్రాజెక్టులు రిజిస్టర్ కాగా, 48 మాత్రమే పోటీల్లో పాల్గొన్నాయన్నారు. డైట్ కళాశాలకు చెందిన సెల్ఫ్ రిపేరింగ్ కాంక్రీట్ ప్రాజెక్టు తృతీయస్థానాన్ని సంపాదించుకుందన్నారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులను అభినందించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



గెడ్డపాలెంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం, మే 11: మండలంలోని గెడ్డపాలెంలోని అభయ ఆంజనేయ స్వామి 17వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద దీపారాధన కార్యక్రమాన్ని గ్రామస్థులు నిర్వహించారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి

- మునిసిపాలిటీలో వివిధఅభివృద్ధి కార్యక్రమాలు చేపడతా..
- మాకవరపాలెంలో సుజల స్రవంతి పథకం పనులు పునః ప్రారంభం
- నాతవరంలో కళాశాల ఏర్పాటు, తాండవ గేట్లకు మరమ్మతులు
- గొలుగొండలో రోడ్లు, కృష్ణాదేవిపేటలో అల్లూరి పార్కు తీర్చిదిద్దుతా
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, మే 11 : సార్వత్రిక ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే విద్య, వైద్యం, రహదార్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తానని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. శనివారం ఇక్కడి తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మునిసిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టడానికి ప్రణాళికలు చేసుకున్నానని వివరించారు గత టీడీపీ హయంలో 150 పడకల ఆస్పత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్, సోలార్ విద్యుత్ సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. చేతకాని ఎమ్మెల్యే కారణంగా ఏరియా ఆస్పత్రి ప్రస్తుతం అధ్వానంగా తయారైందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. మునిసిపాలిటీలో సమగ్ర తాగునీటి పథకం పనులు పరుగుపెట్టించి ఇంటింటికీ శుద్ధి చేసిన నీరు సరఫరా చేస్తామన్నారు. క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మించి, క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మునిసిపాలిటిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వీధి లైట్లు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని పేర్కొన్నారు. సీఎం వచ్చినప్పుడు మునిపాలిటీ నుంచి రూ.40లక్షలు డబ్బులు ఖర్చు పెట్టారని, కేంద్ర మంత్రి నిర్మాలాసీతారామన్ పర్యటనకు వచ్చినప్పుడు రూ.14లక్షలు ఖర్చు పెట్టారని ఆరోపించారు. మునిసిపాలిటీలోని డబ్బులు ఖర్చు పెట్టడానికి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే విచారణ చేయించి, సంబంధిత కమిషనర్‌పై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయిస్తామని స్పష్టం చేశారు. నాతవరంలో జూనియర్ కళాశాల మంజూరుకు జీవో ఆర్డర్ రాకుండా మంత్రి రికమండేషన్ లెటర్ చూపించి ఎమ్మెల్యే ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే జూనియర్ కళాశాల తీసుకు వస్తామన్నారు తాండవ గేట్లు రూ.ఏడు లక్షలతో మరమ్మతులు చేయించలేకపోయారని ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు. మాకవరపాలెంలో సుజల స్రవంతి పథకం పనులు తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఆన్‌రాక్ కంపెనీ కోసం భూసేకరణ చేయగా, అందులో ఇంకా 800 ఎకరాలు మిగిలి పోయిందని, అందులో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. గొలుగొండలో రోడ్లు, కృష్ణాదేవిపేటలో అల్లూరి పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, పార్టీ నాతవరం, మాకవరపాలెం మండలాల అధ్యక్షులు నందిపల్లి వెంకట రమణ, రుత్తల ఎర్రాపాత్రుడు, పెదబొడ్డేపల్లి టీడీపీ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, కన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన క్యూలు

సింహాచలం, మే 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలిరావడంతో సింహగిరి కిటకిటలాడింది. సాధారణంగా భక్తులు శనివారం ఎక్కువ సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడం, పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు రోజు కావడంతో ఉదయం నుండే భక్తుల రాక మొదలైంది. దీంతో శనివారం ఒక్క రోజే భక్తుల రద్దీ వల్ల అప్పన్న ఖజానాకు సుమారు రూ.31.3 లక్షల ఆదాయం సమకూరింది. అత్యధికంగా శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ.17.27లక్షలు, రూ.15 లడ్డూ, రూ10 పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.9.62లక్షలు, ఇతర మార్గాల మరికొంత ఆదాయం లభించింది. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి సిబ్బందిని అప్రమత్తం చేసి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టారు.

108 వాహనంతో గుర్తుతెలియని వ్యక్తి హల్‌చల్

సింహాచలం, మే 11 : జీవీఎంసీ 98వ వార్డులోని కుమ్మరివీధి (మెయిన్ రోడ్డు) వద్ద ఆగి ఉన్న 108 వాహనాన్ని గుర్తు తెలి యని వ్యక్తి నడిపి హల్ చల్ చేశారు. దీంతో స్థానికులు భయాందోళనకు గుర య్యారు. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో కుమ్మరివీధి కూడలిలో ఆగి ఉన్న 108 వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఆకస్మికంగా నడిపాడు. అక్కడి నుంచి సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నెమ్మదిగా నడుపుతూ తీసుకువచ్చాడు. మార్గమధ్యంలో అనేక విధాలుగా మలుపులు తిప్పడంతో నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. విషయం గుర్తించిన స్థానికులు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వాహనాన్ని అడ్డుకుని, అతన్ని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు.

ఓటర్లకు ఎర

... 5వ పేజీ తరువాయి

నాయకులు పంపిణీ చేస్తున్న మద్యాన్ని మంద ుబాబులు తాగుతున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లోనే నాసిరకం సరకు దొరుకుతుంటే ఇప్పుడు ఓటర్లకు పంపిణీ చేస్తున్న మద్యం అంతకన్నా నాసిరకమని అంటున్నారు. ఎమ్మార్పీయే పాతిక రూపాయలుంటే, హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తే మరింత తక్కువ ధరకు వస్తుంది. ఆది, సోమవారాల్లో కూడా ఇదే మద్యం పంపిణీ చేయడానికి ఇరు పార్టీలు సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. అధికార పార్టీకి లభించినంత గోవా మద్యం.. కూటమి అభ్యర్థులకు దొరకలేదు. కూటమి శ్రేణులు సాధారణ షాపుల్లో దొరికే మద్యాన్నే పంపిణీ చేస్తున్నట్టు సమాచారం.

మందు చూపు!



నర్సీపట్నంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద తోపులాట

... 5వ పేజీ తరువాయి

దొండపూడి, కొత్తకోటలో ఉన్న మద్యం దుకాణాల వద్ద ఎండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి వేచి ఉన్నారు. గత రెండు రోజులుగా అధికార పార్టీ నేతలు డబ్బులు పంపిణీ చేయడంతో మందుబాబు జోష్ మీద ఉన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: పట్నంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు శనివారం కిటకిటలాడాయి. షాపులు తెరవక ముందే క్యూలో ఉన్న మందుబాబులు తెరిచిన తరువాత మద్యం కోసం ఎగబడ్డారు. ధనిమిరెడ్డివీధి, చింతపల్లి రోడ్డులో ఉన్న రెండు మద్యం దుకాణాల వద్ద తోపులాట కనిపించింది. ఎన్నిక నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటలకు ఎక్సైజ్ అధికారులు మద్యం షాపులు సీజ్ చేయనుండగా, సరకు నిల్వ చేసుకోవడానికి మందుబాబులు ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద క్యూ కట్టారు. మంగళవారం వరకు సరిపోయే విధంగా ఎగబడి మద్యం కొనుగోలు చేశారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రకారం గత ఏడాది ఈ రోజున ఎంత సరకు విక్రయించారో అంత విక్రయించిన తరువాత దుకాణాలను మూసి వేయాల్సి ఉంది. దుకాణం తెరిచిన రెండు గంటల్లోనే సరకు అయిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంటకు చింతపల్లి రోడ్డులోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చోడవరం ప్రభుత్వ హైస్కూల్, మాడుగుల ఆర్‌సీఎం స్కూల్‌లో నేటి ఉదయం ప్రారంభం
- సిబ్బంది, సామగ్రిని ఆయా కేంద్రాలకు తరలింపునకు వాహనాలు సిద్ధం
- పర్యవేక్షిస్తున్న ఆర్‌వోలు జయరాం, చిన్నికృష్ణ, సత్యవాణి





ఎన్నికల సిబ్బంది, సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలింపునకు నర్సీపట్నంలో సిద్ధం చేసిన వాహనాలు

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల, మే 11 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు మరికొన్ని గంటలే సమయం ఉండడంతో అధికారులు సన్నాహాల్లో తలమునకలయ్యారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని సిబ్బంది ఎవరికి అప్పగించిన విధుల్లో వారు చేరేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా నర్సీపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాకు పోలింగ్ సిబ్బందిని, సామగ్రిని తరలించేందుకు అవసరమైన బస్సులు, ఆటోలు తదితర వాహనాలను సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీకి 24 సెక్టార్లకు సంబంధించి 24 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ ప్రారంభిస్తామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. సిబ్బందిని తరలించేందుకు పదిహేను ఆర్టీసీ బస్సులు, ఎనిమిది మినీ బస్సులు సిద్ధం చేశామన్నారు

అలాగే, చోడవరం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం పోలింగ్ సామగ్రి పంపిణీ జరగనుంది. ఇప్పటికే ఆయా సామగ్రిని సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా మాడుగుల పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి రిటర్నింగ్ అధికారిణి సత్యవాణి పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని 235 కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అవసరమైన సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించారు.

నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులు కేటాయింపు

ఇదిలావుంటే, వివిధ నియోజకవర్గాలలో పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు వీలుగా నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులు కేటాయించారు. వీటిలో పాడేరుకు పది, రంపచోడవరానికి తొమ్మిది బస్సులను శనివారం తరలించారు. మిగిలిన బస్సులు ఆదివారం ఉదయం పంపించనున్నారు. సోమవారం పోలింగ్ పూర్తి చేసుకున్న తర్వాత రాత్రికి తిరిగి డిపోకు ఆయా బస్సులు చేరుకుంటాయి.

ఎన్నికల నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, కార్యదర్శుల సమావేశంలో తహసీల్దార్లు



నాతవరంలో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

నాతవరం, మే 11 : ఎన్నికల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ కుమార్ సూచించారు. శనివారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఎంపీడీవో జె.రాంబాబు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి వందమీటర్ల దూరంలో పార్టీల జెండాలు ఉండకుండా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రామారావు, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : పోలింగ్ నిర్వహణకు సంబంధించి అంతా సిద్ధం చేసినట్టు తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పించినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా ఉన్న 59 పోలింగ్ బూత్‌లలో విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంపు వంటి ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే సీసీ కెమెరాలు సైతం అమర్చామన్నారు. ఎన్నికల విధులను అంతా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

మాడుగుల : సార్వత్రిక ఎన్నికలను మాడుగుల నియోజకవర్గంలో పకడ్బందీగా నిర్వహిచనున్నామని రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి తెలిపారు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాల్లో లక్షా 88వేల 989 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఇందులో 60 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి అక్కడ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ నిర్వహించేందుకు 542 మంది పీవో, ఏపీవోల నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించి ఓటు వేయాల్సిందిగా కోరారు.

కూటమికే తూర్పు కాపుల మద్దతు

- సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమణయ్య



విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు

గొలుగొండ, మే 11 : టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థులకే విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో తూర్పు కాపులు మద్దతు ఇస్తున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లా తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణయ్య స్పష్టం చేశారు. గొలుగొండలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో తూర్పుకాపులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దీంతో ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి తామంతా మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. తూర్పుకాపులంతా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బంగారయ్య బట్టా రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

నర్సీపట్నం, మే 11 : మునిసిపాలిటీ పరిధిలోని పెద బొడ్డేపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కుమార్ తదితరులు శనివారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే, నాతవరం మండలం చమ్మచింత పంచాయతీ కురవా గ్రామానికి చెందిన రజాక్ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీలోకి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి

మాడుగుల రూరల్, మే 11 : మండలంలోని ఎం.కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ శనివారం వైసీపీని వీడి బీజేపీలో చేరారు. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

13న ఉద్యోగ, కార్మికులకు సెలవు ప్రకటించాలి : సీఐటీయూ డిమాండ్

పరవాడ, మే 11 : ఈనెల 13న జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును ఉద్యోగ, కార్మికులు ఉపయోగించుకోవడానికి సెలవు ప్రకటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ, ఫార్మా పరిశ్రమలు, రాంకీ ఎస్ఈజెడ్, ఇండస్ట్రియల్ పార్కు, లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్, జిల్లాలోని షాపులు, షాపింగ్‌మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు సెలవు ప్రకటించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ప్రచారంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న సీఎం రమేష్

మాడుగులను అభివృద్ధి చేసి చూపిస్తాం

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

మాడుగుల, మే 11 : సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా కూటమి అభ్యర్థులకు పట్టం కట్టాల్సిందిగా అనకాపల్లి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ పిలుపునిచ్చారు. శనివారం మాడుగులలోని టీడీపీ కార్యాలయం నుంచి ముందుగా ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, పార్టీ నాయకుడు పైలా ప్రసాదరావులతో కలిసి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం బస్టాండ్ నుంచి ఆదే ప్రచార రథంపై రమేష్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే రానున్న ఐదేళ్ల కాలంలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. మాడుగుల ప్రజల అమాయకత్వాన్ని చూసి బూడి ముత్యాలనాయుడు దోచుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దోచుకున్నదంతా కక్కిస్తామన్నారు. ఇదిలావుంటే, బస్టాండ్ వద్ద ఉన్న ఓ హల్వా షాపు వల్ల ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్నందున దానిని తొలగించాల్సిందిగా సీఎం రమేష్ ఆ వ్యాపారికి సూచించారు. అనంతరం మోదకొండమ్మను వీరంతా కలిసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు వీరిని సత్కరించారు.

కూటమి గెలుపుతోనే చోడవరానికి మహర్దశ

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



వడ్డాదిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, మే 11 : కూటమి విజయంతో చోడవరం అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వడ్డాదిలో శనివారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. సమర్థత కలిగిన కూటమి అభ్యర్థులు అనకాపల్లి పార్లమెంటు నుంచి పోటీ చేస్తున్న సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే స్థానానికి పోటీలో ఉన్న కేఎస్ఎన్ఎస్ రాజులకు ఈ ఎన్నికల్లో అంతా ఓట్లు వేయాల్సిందిగా కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అవినీతి, అసమర్థత కారణంగా చోడవరం నియోజకవర్గం అన్నింటా వెనుకబడిపోయిందని ఆరోపించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గంలో భూదందాలు, ప్రభుత్వ సేవలకు అక్రమ వసూళ్లు, అవినీతి పెచ్చుమీరిందని వాపోయారు. పరిశ్రమలు స్థాపన ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పన, రహదారులు, సాగు, తాగునీటి వనరుల అభివృద్ధి మహిళా, రైతుల సాధికారిత చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు ఉంటేనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ప్రతి ఒక్కరూ ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దొండా సన్యాసిరావు, దాడి సూర్యనాగేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా నరేష్, శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర, దొండా గిరిబాబు, సింగంపల్లి రమేష్, కనకరాజు, వీర్ల సురేష్, దొండా సాయి తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు శివారు ఆదివాసీలకు రవాణా సౌకర్యం

- పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు : తహసీల్దార్

రావికమతం, మే 11 : సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు ఆదివాసీ గ్రామాల ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని తహసీల్దార్ రమణారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలో 19 శివారు ఆదివాసీ గ్రామాలకు చెందిన సుమారు 1900 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నిబంధనల మేరకు చీమలపాడు, ములకలాపల్లి గ్రామాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలకు పదిహను శివారు గ్రామాలు 10 నుంచి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్నందున జె.జోగుంపేటలో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని శివారు గ్రామాల ఆదివాసీలు ఆందోళనలు చేపట్టారన్నారు. అప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినందున ఆదివాసీలు కోరిన మేరకు ఏర్పాటు సాధ్యం కాలేదన్నారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ చొరవతో ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. శివారు గిరిజన గ్రామాల ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు, తిరిగి వారిని గ్రామాలకు చేరవేసేందుకు ఉచిత రవాణా సౌకర్యం కోసం వాహన సదుపాయం కల్పించారన్నారు. ఆరు మినీ బస్సులు, ఆరు జీపులు, నాలుగు ఆటోలను సిద్ధం చేసినట్టు చెప్పారు. వీటికి జియో టాకింగ్ కూడా చేయడం జరిగిందన్నారు. ఆయా గిరిజనుల ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు

- విషాదంలో మునిగిన వీరవిల్లి అగ్రహారం



మృతదేహాలను ఊరేగింపుగా శ్మశానవాటికకు తెస్తున్న గ్రామస్థులు

మాడుగుల రూరల్, మే 11 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకుల అంత్యక్రియలు మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో శనివారం నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన శీలం మధు, విస్సారపు గణేశ్‌లు శుక్రవారం బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద బీఎన్ రోడ్డులో బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతులు ఇద్దరిదీ ఒకే గ్రామం. ఇద్దరూ మంచి స్నేహితులు. మృత్యువులోనూ వీరి స్నేహబంధం వీడలేదని అంతా కంటతడిపెట్టారు. వడ్డాది జంక్షన్ నుంచి వీరవిల్లి అగ్రహారం శ్మశానవాటిక వరకు మృతదేహాలను అంబులెన్స్‌లో ఉంచి యువకులు, గ్రామస్థులంతా ఊరేగింపుగా తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఐదు నెలలైనా పరిహారం అందలేదన్నా..

- మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతులు ఎదురుచూపులు
- నాతవరం మండలంలో 869 ఎకరాల్లో నాడు వరి పంట నష్టం
- రెండు నెలల క్రితం బటన్ నొక్కిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- నేటికీ అకౌంట్లలో పడని నగదు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై అన్నదాతలు ఆగ్రహం



తుఫాన్ ధాటికి నాతవరం మండలం గుమ్మిడిగొండలో నేలకొరిగిన వరి పంట (ఫైల్)

నాతవరం, మే 11 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రెండు నెలలు దాటినా మండలంలోని మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదు. దీంతో వారంతా ఎదురు చూపులు చూస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా నాతవరం మండలంలో 869 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. దీనివల్ల 985 మంది రైతులు నష్టపోయినట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. ఈ మేరకు వీరికి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. సంబంధిత రైతులకు రూ.59 లక్ష లను ప్రభుత్వం నష్టపరిహారంగా మం జూరు చేసింది. ఈ ఏడాది మార్చి ఆరో తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇందుకు సంబంధించిన బటన్‌ను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇవ్వడానికి నొక్కారు. ఈ నష్టపరిహారం అందుతుందని బాధిత రైతులు కొండంత ఆశతో ఎదురు చూశారు. కానీ వారి ఆశలు అడియాశలే అయ్యాయి. ముఖ్యమంత్రి బటన్‌నొక్కి రెండు నెలలు దాటింది. నాటి నుంచి తరచూ మండలంలోని పలువురు రైతులు బ్యాంకులకు వెళ్లడం, అకౌంట్లలో నగదు జమ అయ్యిందో లేదో చూడడం వంటివి చేస్తున్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే, ఇన్నాళ్లూ ఈ పరిహారం ఊసెత్తిన జగన్ ప్రభుత్వం, సార్వత్రిక ఎన్నికలకు నాలుగు రోజుల ముందు జనవరి నెల నుంచి వివిధ పథకాల కింద బటన్ నొక్కిన మొత్తాన్ని ఆయా లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయాలని ప్రయత్నించింది. దీనికి ఎన్నికల కమిషన్ అభ్యం తరం చెప్పడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వ్యవహార శైలిపై పలు వురు బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం తమ పరిహారం కోసం బటన్ నొక్కి ఇంతవరకు వెయ్యకుండా, కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వేయాలన్న ఆలోచన చేయడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ముందుగా తెలిసినా జగన్ సర్కారు ఇంతలా నిర్లక్ష్యం చేయడం ఏమిటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఎన్నికలు ముగిసిన వెంటనేనైనా తమకు పరిహారం అందేలా పాలకులు, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.